క్లుప్తంగా

సీపీఎం ఆధ్వర్యంలో రోడ్ల పరిశీలన

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే లింకు రోడ్లకు మరమ్మతులు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నన్నూరి రమణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో తిప్పర్తి మండలంలోని ఇండ్లూరు నుంచి పజ్జూరు, మామిడాలకు వెళ్లే రోడ్లను పరిశీలించి మాట్లాడారు. వర్షాల వల్ల రహదారులపై ఏర్పడిన గుంతల్లో నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు భీమగాని గణేష్, కన్నెబోయిన శంకర్, పేరం లింగయ్య, ఎన్. లింగయ్య, దొడ్డబోయిన లింగరాజు, సైదులు, రామచంద్ర వెంకులు, ఎల్లమ్మ, అచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలు పరిష్కరించాలని వినతి


ఎంపీ కిరణ్‌కుమార్ రెడ్డికి పూల బొకే అందజేస్తున్న కైలాస్ నేత, తదితరులు

మునుగోడు: పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్న కైలాస్ నేత ఎంపీలను కోరారు. ఇటీవల గెలుపొందిన నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డిని శుక్రవారం ఆయన హైదరాబాద్‌లో కలిసి శుభకాంక్షలు తెలిపారు. వారిని ఘనంగా సన్మానించి ఆయా పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని సమస్యలను వివరించినట్లు కైలాస్‌నేత తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో అన్నదానం


అన్నదానం చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

నల్లగొండ టౌన్ : న్యూ కంబాల శివలీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగుల సహాయకులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ కంబాల శివలీల, ముత్యాలు, ఏర్పుల ముత్యాలు, పుష్పమ్మ, లక్ష్మీబాయి, నాగేశ్వర్‌రావు, మహేశ్వరరావు, మాధవరావు, లక్ష్మీ, రోహిణి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

26, 27 తేదీల్లో కేవీపీఎస్ శిక్షణ తరగతులు



సమావేశంలో మాట్లాడుతున్న నాగార్జున

నల్లగొండ టౌన్ : కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా స్థాయి శిక్షణ తరగతులను ఈ నెల 26, 27 తేదీల్లో నల్లగొండలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున తెలిపారు. శుక్రవారం నల్లగొండలోని దొడ్డి కొమురయ్య భవన్‌లో జరిగిన కేవీపీఎస్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో కొండేటి శ్రీను, మల్లన్న, శివకుమార్, విజయ్‌కుమార్, మల్లయ్య, రాధిక పాల్గొన్నారు.

ఇంకుడు గుంత ఉంటేనే అనుమతి

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలో 300 చదరపు గజాల భూమి ఉంటే తప్పని సరిగా ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలని మిర్యాలగూడ మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ సూచించారు. ఇంకుడు గుంత ఉంటేనే భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలను పరిశీలించి మాట్లాడారు. ఇంకుడు గుంతలను నిర్మించుకోని వారికి ఇప్పటికే రెడ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఆయన వెంట మున్సిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ తదితరులు ఉన్నారు.

రికార్డుల తనిఖీ

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మున్సిపాలిటీ కార్యాలయంలో శుక్రవారం సమాచార హక్కు కార్యకర్తలు పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సమాచార హక్కు కార్యకర్తలు సరికొండ రుషికేశ్వర్‌రాజు, చిలుముల కొండల్, దేవులపల్లి కార్తీక్ రాజు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 2 (జే)సమాచార హక్కు ప్రకారం ప్రతి పౌరుడు ప్రభుత్వ కార్యాలయాల్లో రికార్డులు తనిఖీ నిర్వహించవచ్చన్నారు. తనిఖీల సమయంలో అవసరమైన సమాచారాన్ని ధ్రువీకరించుకుని తీసుకునే అవకాశం కూడా ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరికీ హక్కుల చట్టాల గురించి వివరించాలన్నారు.

● వానాకాలం సాగు ముమ్మరం


చీకటిమామిడిలో పత్తి విత్తనాలు విత్తుతున్న కూలీలు


మునుగోడులో అచ్చుతోలుతున్న రైతు


మునుగోడు : విత్తనాలు కొనుగోలు చేస్తున్న రైతులు


పులిపలుపులలో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుకుంటున్న రైతు

మునుగోడు: వానాకాలం సాగు పనుల్లో రైతన్నలు బిజీ అయ్యారు. గడిచిన కొద్ది రోజులుగా మునుగోడు మండల వ్యాప్తంగా ఓ మోస్తరు వర్షాలు కురుస్తుండటంతో ఇప్పటికే దుక్కులు దునున్నకున్న రైతులు పత్తి విత్తనాలు నాటిస్తున్నారు. కొందరు ట్రాక్టర్లతో దుక్కులు దున్నుకుంటున్నారు. ఇంకొందరు రైతులు విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. ఏ వ్యవసాయ భూమిలో చూసినా కూలీలు, దుక్కులు దున్నే ట్రాక్టర్ యజమానులు, అచ్చు తోలుకునే రైతులే కన్పిస్తున్నారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలి



మర్రిగూడ : ర్యాలీలో పాల్గొన్న సీడీపీఓ లావణ్యకుమారి, అంగన్‌వాడీ సిబ్బంది

మర్రిగూడ: తల్లిదండ్రులు తమ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని సీడీపీఓ లావణ్యకుమారి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రంలో విద్య అందిస్తున్నట్లు పేర్కొన్నారు. చిన్నారులకు ఉచిత భోజనాన్ని అందించి ఆటపాటలతో విద్యను అందిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ యశోద, అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి, విమలదేవి, లక్ష్మి పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డు పరిశీలన


చిట్యాలలో డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

చిట్యాల: పట్టణంలోని పోతరాజు చెరువులోని డంపింగ్‌యార్డును తొలగించాలని సీపీఐ చిట్యాల మండల కార్యదర్శి అక్బర్ డిమాండ్ చేశారు. చిట్యాల పట్టణంలోని పోతరాజు చెరువులో వేస్తున్న చెత్తను శుక్రవారం ఆయన సీపీఐ నాయకులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. చెరువులో చెత్తను వేసి డంపింగ్ యార్డుగా మార్చటంతో రహదారిపై వెళ్లే వాహనదారులతో పాటు ఆ పక్కన గల కాలనీవాసులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. డంపింగ్ యార్డును మార్చి పోతరాజు చెరువును పునరుద్ధరించాలని ఆయన అధికారులు, ప్రజాప్రతినిధులను కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ కార్యదర్శి షరీఫ్, నాయకులు దేశగాని బాలరాజు, గుండాల సత్తయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం


కల్యాణానికి హాజరైన భక్తులు

మునుగోడు: మండలంలోని జమస్తాన్‌పల్లి గ్రామంలోని శ్రీ సీతారామాంజనేయ దేవాలయంలో శుక్రవారం సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. మాస కల్యాణ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన కల్యాణోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామిఅమ్మవారికి వడి బియ్యం సమర్పించారు. అనంతరం మహోత్సవానికి హాజరైన భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ మాజీ సర్పంచ్ పంతంగి పద్మస్వామి, మునుగోడు గ్రామ పంచాయతీ మాజీ కోఆప్షన్ సభ్యుడు పాలకూరి నర్సింహగౌడ్, జాజు ల స్వామి గౌడ్, ముంత యాదగిరి, అంజయ్య, జాజుల శంకర్, పగిళ్ల సైదులు, ముంత మారేష్, శ్రీనివాసులు, హేమంత్, వెంకన్న, ప్రసాద్ పాల్గొన్నారు.

యూనిఫాం అందజేత

కనగల్ : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కుట్టించిన 3017జతల యూనిఫాంలను శుక్రవారం మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ భవనంలో ఎంఈఓ తరి రాములుకు ఏపీఎం సంకు హరి, సమాఖ్య మహిళలు అందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు విద్యార్థుల బుక్స్, యూనిఫాం తీసుకొని వెళ్లి జూన్ 12వ నాటికి విద్యార్థులకు అందించాలన్నారు.


ఎంఈఓకు యూనిఫాం అందజేస్తున్న ఏపీఎం

‘రైతు భరోసా’ అమలు చేయాలి : ఉజ్జిని


చండూరు: మాట్లాడుతున్న రత్నాకర్‌రావు

చండూరు: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతుల పెట్టుబడి సహాయం కింద అందించాల్సిన రైతు భరోసాను వెంటనే అమలు చేయాలని సీపీఐ సీనియర్ నాయకుడు ఉజ్జిని రత్నాకర్ రావు కోరారు. శుక్రవారం ఆయన చండూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు తీసుకుంటున్నారని తెలిపారు. రైతు భరోసా అందిస్తే అప్పులుచేసే బాధ తప్పుతుందన్నారు. ఆగస్టు 15లోగా రైతు రుణమాఫీని కూడా మాట తప్పకుండా అమలు చేయాలని ఆయన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. పలువురు విత్తనాలు, ఎరువుల వ్యాపారులు అధిక లాభల కోసం ప్రభుత్వం నిర్ణయించిన దాని కంటే అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తున్నారని, దానిని వెంటనే అరికట్టాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నలపరాజు రామలింగయ్య, మండల కార్యదర్శి సతీష్ కుమార్, జెల్ల శ్రీను, చెడుబుత్తి ఊషయ్య, పరమేష, శంకర్ పాల్గొన్నారు.

ఆత్మగౌరవ కవాతును జయప్రదం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

నల్లగొండ టౌన్ : ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూలై 7న వరంగల్ జిల్లా కేంద్రంలో నిర్వహించే మాదిగల ఆత్మగౌరవ కవాతును జయప్రదం చేయాలని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్ మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానికంగా జరిగిన ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగల ఆత్మగౌరవ కవాతును విజయవంతం చేయడానికి ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల నాయకులు గ్రామ స్థాయినుంచి ప్రజలను సమీకరించేందుకు సన్నాహక కవాతు నిర్వహించాలన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం, కొంపెల్లి విశ్వపతి, ఏడుకొండలు, మేడి శంకర్, కొమిరెస్వామి, శ్రీనివాస్, యాదయ్య, శ్రీనివాసులు, కమలమ్మ, మోహన్, సత్యనారాయణ, వెంకన్న పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- కేతేపల్లి ఎంపీపీ శేఖర్
- సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం


కేతేపల్లి మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శేఖర్

కేతేపల్లి: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కేతేపల్లి ఎంపీపీ శేఖర్ అన్నారు. తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించి నీరు కలుషితం కాకుండా చూడాలని సంబంధిత అధికారులను కోరారు. ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్ అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. మండల పంచాయతీ శాఖకు సంబంధించిన ప్రగతి నివేదికను సమావేశంలో సభ్యులకు అందజేయక పోవటం పట్ల ఎంపీపీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రగతి నివేదిక లేకుండా ఆ శాఖకు సంబంధించిన సమస్యలపై సభ్యులు ఎలా మాట్లాడుతారని అసహనం వ్యక్తం చేశారు. అమ్మ ఆదర్శ పథకం కింద పాఠశాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

గంటన్నరలో సమావేశం ముగింపు

మధ్యాహ్నం 12గంటలకు ప్రారంభమైన సమావేశం కేవలం గంటన్నర సమయం మాత్రమే సాదాసీదాగా సాగింది. 11 మంది ఎంపీటీసీ సభ్యులకు గాను ఎంపీపీతో సహా ఆరుగురు ఎంపీటీసీలు హాజరయ్యారు. 18 ప్రభుత్వ శాఖల అధికారులకు 12శాఖల ప్రతినిధులు మాత్రమే హాజరయ్యారు. ఆర్అండ్‌బీ, కాతీయ మిషన్, ఆటవీ, ఐబీ, మూసీ, ఉద్యానవన శాఖల అధికారులు, కిందిస్థాయి సిబ్బంది సమావేశానికి డుమ్మా కొట్టారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు నేపథ్యంలో రెవెన్యూ, వైద్య, పశువైద్య, ఉపాధిహామీ శాఖల అధికారులకు బదులుగా కిందిస్థాయి సిబ్బంది హాజరయ్యారు. ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను చదివి సమావేశాన్ని ముగించారు. సమావేశంలో జెడ్పీటీసీ బొప్పని స్వర్ణలతసురేష్, పీఏసీఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పెదబొస్క మాధవి, ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, ఎంఈఓ నాగయ్య, ఏఓ బి.పురుషోత్తం, ఐకేపీ ఏపీఎం బి.యాదమ్మ, ఆర్‌డబ్ల్యూస్, పీఆర్, ట్రాన్స్‌కో ఏఈలు మౌనిక, శ్రీనివాసరావు, గాబ్రియేల్ తదితరులు పాల్గొన్నారు.

నివాస గృహాల మధ్య మురుగు నీరు


మునుగోడులోని నివాస గృహాల మధ్య నిలిచిన మురుగునీరు

మునుగోడు: నియోజకవర్గ కేంద్రం జర్నలిస్టుల కాలనీలోని నివాస గృహాల మధ్య నిలిచిన మురుగునీటితో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నీరు సాఫీగా దిగువకు వెళ్లేందుకు డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ఆ నీరంతా ప్రజల నివాసాల మధ్య నిల్వ ఉంటోంది. దీంతో దోమలు వృద్ధి చెంది అనారోగ్యం బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని గ్రామంలోని నివాసాల మధ్య మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మిషన్ భగీరథ నీరు వృథా


పోలీస్‌స్టేషన్ ఎదుట నిలిచిన మిషన్ భగీరథ నీరు

కేతేపల్లి: మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ వద్ద మిషన్‌భగీరథ ప్రధాన పైప్‌లైన్ పగిలి నీరంతా వృథాగా పోతుంది. పైప్‌లైన్ పగిలి తాగునీరు లీకవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. నీటి సరఫరా నిలిపి వేసిన తర్వాత నీరంతా పైప్‌లైన్‌లోకి వెళ్లి కలుషితమవుతోంది. లీకేజీ అయిన చోట నీరు నిలిచి బురద గుంటలా మారింది. అధికారులు స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయాలని పోలీసు సిబ్బంది, ప్రజలు కోరుతున్నారు.

ఆర్థికసాయం అందజేత

మిర్యాలగూడ అర్బన్ : ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎద్దు ఉపేందర్ కుటుంబానికి టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేశారు. శుక్రవారం పట్టణంలోని టీచర్స్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఉపేందర్ కుటుంబ సభ్యులకు రూ.1.20లక్షల విలువైన చెక్కు అందజేశారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాగమణి, మక్కా శ్రీనివాసచారి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

- పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సుంకరి భిక్షం


మునుగోడు : ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

మునుగోడు: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్య అందుతోందని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు, మునుగోడు ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సుంకరి భిక్షంగౌడ్ అన్నారు. తల్లితండ్రులు తమ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఆయన కోరారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మునుగోడులో ఇంటింటికీ తిరిగి విద్యార్థుల తల్లితండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా బోధనతో పాటు ఉచితంగా పాఠ్య, నోట్ పుస్తకాలతో పాటు మధ్యాహ్న భోజనం, రెండు జతల యూనిఫామ్స్ అందిస్తామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

నెల్లిబండలో బడిబాట ర్యాలీ

నకిరేకల్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని కోరుతూ శుక్రవారం నకిరేకల్ మండలం నెల్లిబండ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మంజుల, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మల్లమ్మ, ఉపాధ్యాయుడు కనుకుంట్ల విద్యాసాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

కేతేపల్లిలో బడిబాట

కేతేపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని కేతేపల్లి ఎంఈఓ నాగయ్య అన్నారు. శుక్రవారం కేతేపల్లిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు విధిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు గ్రామంలోని ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ పి.సుశీల, పాఠశాల హెచ్‌ఎం నర్సిరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


నకిరేకల్ : ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు


కేతేపల్లి: బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఘనంగా లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి కల్యాణం

వేములపల్లి : మండలంలోని రావులపెంట గ్రామంలో వెలసిన లక్ష్మీ తిరుపతమ్మగోపయ్య స్వామి కల్యాణ వేడుకలను శుక్రవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోలాటాలు, డప్పు వాయిద్యాలతో మహిళలు బోనాలను తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. వేద పండితుల సమక్షంలో మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కల్యాణోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదానంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నంద్యాల శ్రీరామ్, మాజీ సర్పంచ్ దొంతిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు జిన్నా నాగిరెడ్డి, అవిరెండ్ల వేణు, నాయకులు శీలం శ్రీనివాస్, పిండి సతీష్‌రెడ్డి, జగన్, రాము పాల్గొన్నారు.

సర్కార్ బడుల్లోనే సౌకర్యాలు

- నోట్, పాఠ్య పుస్తకాలతో పాటు యూనిఫాం అందజేత
- విద్యార్థులకు సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం
- తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఉపాధ్యాయుల విజ్ఞప్తి


బుదుమర్లపల్లిలోని మోడల్ పాఠశాల


పాఠశాలలో ఆహ్లాదకరమైన వాతావరణం

కనగల్: ఉచితంగా నోట్, పాఠ పుస్తకాలు.. రెండు జతల యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం.. ఆహ్లాదకరమైన వాతావరణంలో నాణ్యమైన బోధన ఇలా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు ఉన్నాయి. నూతన విద్యా సంవత్సరం మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానుండటంతో అప్పుడే ప్రైవేట్ పాఠశాలల సిబ్బంది గ్రామాల్లో విస్తృతంగా ఇంటింటికీ తిరుగుతూ పిల్లల తల్లిదండ్రులను మభ్యపెడుతూ అడ్మిషన్ తీసుకోవాలని కోరుతున్నారు. ఇలాంటి వారి మాటలను పిల్లల తల్లిదండ్రులు నమ్మకుండా ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

సౌకర్యాలు ఇవీ..

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నోట్, పాఠ్య పుస్తకాలను ప్రభుత్వమే ఉచితంగా ఇస్తుంది. బడులు తెరవక ముందే పాఠ్య పుస్తకాలను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు అందిస్తున్నారు. ప్రభుత్వ బడుల్లో సన్నబియ్యంతో పిల్లలకు కడుపు నిండా భోజనం పెడుతున్నారు. వారానికి రెండు కోడి గుడ్లు, ఆకుకూరలు, కూరగాయాలు, పప్పులతో పిల్లలకు వడ్డిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు ఉచితంగా యూనిఫామ్స్ పంపిణీ చేస్తున్నారు. విద్యార్థులందరికీ రెండు జతల చొప్పున దుస్తులను ఇస్తున్నారు. పాఠశాల తెరిచే మొదటి రోజే వీటిని పిల్లలకు అందించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

ఇంగ్లిష్ మీడియంతో పాటు కంప్యూటర్ విద్య

సర్కార్ బడుల్లోనూ ఇంగ్లిష్ మీడియంతో పాటు కంప్యూటర్ విద్య అందిస్తున్నారు. కంప్యూటర్ శిక్షణ ఇచ్చే ఇన్‌స్ట్రక్టర్ కాంట్రాక్ట్ గడువు ముగియడంతో చాల పాఠశాలల్లో ఈ విద్య ఆటకెక్కినా.. వనరులు మాత్రం పాఠశాలల్లో ఉన్నాయి. కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల శ్రద్ధతో కంప్యూటర్ పాఠాలు చెబుతున్నారు. మళ్లీ ఈ విద్యను గాడిన పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకునే దిశగా పయణిస్తుంది.

కనగల్ మండలంలో 53పాఠశాలలు

కనగల్ మండల వ్యాప్తంగా 53 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అందులో 37ప్రాథమిక, 6ప్రాథమికోన్నత, 7ఉన్నత, ఆదర్శ, గురుకుల, కేజీబీవీ పాఠశాలలు ఉన్నాయి. శేరి లింగోటం, చెట్లచెన్నారం గ్రామపంచాయతీ పరిధిలోని గోగుబుచ్చయ్యగూడెం, మంచినీళ్లబావి, శాబ్దుల్లాపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య లేకపోవడంతో గతంలోనే వాటిని మూసివేసారు. మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 4,500మంది విద్యార్థులు విద్య అభ్యసిస్తున్నారు.

‘పది’లో ఉత్తీర్ణత శాతం ఇలా..

మండల వ్యాప్తంగా ఏడు ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలు ఉన్నాయి. మొత్తం 320మంది విద్యార్థులకు గాను 300మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో చర్లగౌరారం ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు 83శాతం మార్కులతో పాసయ్యారు. చినమాదారం పాఠశాలకు చెందిన 48 మందికి అందరూ, దోరెపల్లిలో 19మందికి 18 , జి.యడవల్లిలో 22మందికి 18, కనగల్‌లో 53మందికి 46, కురంపల్లిలో 20మందికి 20, రేగట్టిలో 26మందికి 26, ఆదర్శ పాఠశాల 94మందికి 88, కేజీబీవీలో 32మందికి 31 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.


కురంపల్లిలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుంది. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉండటం వల్ల విద్యార్థులు మంచి మార్కులు సాధించే అవకాశం ఉంటుంది. బడిబాట కార్యక్రమం ద్వారా విద్యార్థుల తల్లిదండ్రుల ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పిస్తున్నాం. పది ఫలితాల్లో మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఉత్తీర్ణత సాధించారు.

– తరి రాములు, ఎంఈఓ, కనగల్